మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 142 గురువారం 13 - 11 - 2025 పేజీలు: 8 వెల: 4

## సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం



3లో..

# విజయానికి విద్య కీలకం




- విజయం అంటే కేవలం వ్యక్తిగత లక్ష్యాలను సాధించడం మాత్రమే కాదు.. సమాజానికీ ఉపయోగపడాలి
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్

మనగళం, కర్నూలు సిటీ : విజయానికి విద్య కీలకమని, విజయం అంటే కేవలం వ్యక్తిగత లక్ష్యాలను సాధించడం మాత్రమే కాదని, సమాజానికీ ఉపయోగపడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. బుధవారం నగరం లోని ఏ.క్యాంప్ లో ఉన్న మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్ లో మాంటిస్సోరి సంస్థల గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కార్యక్ర మానికి గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత దివంగత కళ్యాణమ్మ అంకిత భావంతో విద్యా రంగం అభివృద్ధి కి కృషి చేశారని, పిల్లల సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడానికి వినూత్న బోధనా పద్ధతులను అమలు చేయడంలో మాంటిస్సోరీ విద్యాసంస్థలు కృషి చేశాయని తెలిపారు. పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, నంద్యాల ఎంపీ డాక్టర్ బి.శబరి, అనేక మంది రాజకీయ నాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఐఏఎస్, ఐపీఎస్ అధికారి, వైద్యులు, న్యాయవాదులు, పైలట్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు మాంటిస్సోరి విద్యా సంస్థలలో చదువుకున్నారన్న విషయం తెలిసి చాలా సంతోషంగా ఉందన్నారు. విద్య ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొంది స్తుందన్నారు. అసమానతలను తగ్గించడంలో విద్య ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. విద్య సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తుందని, పేదరిక చక్రాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. బాలికలు, మహిళలు చదువుకున్నప్పుడు వారి కుటుంబాలతో పాటు 2 లో..

## మళ్లీ చర్చలోకి ప్రధాని

# మోదీ డిగ్రీ వివాదం

- ఢిల్లీ యూనివర్సిటీకి హైకోర్టు మూడు వారాల గడువు
- సీఐసీ ఆదేశాలపై అప్పీలు, జనవరి 16న తదుపరి విచారణ
- పారదర్శకత, ప్రజా ఆసక్తిపై వాదనలు మళ్లీ వేడెక్కనున్నాయి



మన గళం, న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ విద్యా అర్హతలపై కొనసాగుతున్న చట్టపరమైన వివాదం మరోసారి దేశ దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రధాని మోదీ బ్యాచిలర్ డిగ్రీ వివరాలను బహిర్గతం చేయాలన్న పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు ఈరోజు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తమ అభ్యంతరాలను సమర్పించడానికి ఢిల్లీ యూనివర్సిటీకి మూడు వారాల గడువు ఇచ్చింది. చీఫ్ జస్టిస్ దేవేందర్ కుమార్ ఉపాధ్యాయ్, జస్టిస్ తుషార్ రావు గేదెలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు 2 లో..

# సాయం చేయండి

- తుపాను బాధితులను ఆదుకోండి
- కేంద్రం నుంచి రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయండి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ వినతి



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల తుపాను బీభత్సం సృష్టించిందని, ప్రత్యేకించి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సాయం చేయాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ, గ్రామాభివృద్ధి 2 లో..



## డిసెంబర్ 6వ తేదీకి

# ఉగ్ర ప్రణాళిక!

- ఎర్రకోట దాడి వెనుక భయంకర కుట్ర

మన గళం, న్యూఢిల్లీ : ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనకు పాల్పడిన సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ నబీ (28) డిసెంబర్ 6వ తేదీని లక్ష్యంగా చేసుకొని భారీ ఉగ్ర దాడి ప్రణాళిక సిద్ధం చేసినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేత దినం సందర్భంగా పెద్ద ఎత్తున ఉగ్రదాడి జరపాలని 2 లో..







## ఉన్నత విద్యా మార్పులకే

# భవిష్యత్తు దిశ

- అమరావతిలో ఘనంగా హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ - 2025
- యువతకు చిత్తశుద్ధి, విద్యావేత్తలకు సంస్కరణల్లో భాగస్వామ్యం పిలుపు
- మంత్రి నారా లోకేష్

మన గళం, అమరావతి : సీఐఐ సదరన్ రీజియన్ మరియు విట్ ఏపీ సంయుక్తంగా నిర్వహించిన హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ - 2025 కార్యక్రమం అమరావతిలో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య, నైపుణ్యాభివృద్ధి మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడు 2 లో..

# గవర్నర్ తో మర్యాదపూర్వక భేటీ





మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తో ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) నగరూరు రాఘవేంద్ర మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కర్నూలు నగరం లోని మాంటిస్సోరీ విద్యా సంస్థల గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కార్యక్రమానికి హాజరైన గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కు ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మురళీనాయుడు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ చర్చలోకి ప్రధాని మోదీ డిగ్రీ వివాదం

వెలువరించింది. ఆగస్టులో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై వేసిన అప్పీల్ ఆలస్యం అవుతున్నదని కోర్టు గమనించింది. ఢిల్లీ యూనివర్సిటీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ కేసుపై తదుపరి విచారణను 2026 జనవరి 16వ తేదీకి వాయిదా వేసినట్లు హైకోర్టు ప్రకటించింది.

**- సీఐసీ ఆదేశాలపై వివాదం**

ప్రధాని మోదీ డిగ్రీ వివరాలను బహిర్గతం చేయాలన్న సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ ఆదేశాలను ఆగస్టు 25న సింగిల్ జడ్జి పక్కనపెట్టారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ మొత్తం నాలుగు అప్పీలు హైకోర్టులో దాఖలయ్యాయి. ఆర్టీఐ కార్యకర్త నీరజ్, ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్, అడ్వకేట్ మొహమ్మద్ ఇర్షద్‌ల పిటిషన్లను ధర్మాసనం ప్రస్తుతం విచారిస్తోంది.

**- పారదర్శకత వర్సెస్ వ్యక్తిగత హక్కులు**

ఆగస్టు తీర్పులో సింగిల్ జడ్జి "ప్రజా ఆసక్తికన్నా పారదర్శకత ముఖ్యమైనదే కాని, వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడం వల్ల సెన్సేషన్ సృష్టించడం ఉద్దేశం కాదు" అని వ్యాఖ్యానించారు. అయితే, ఆర్టీఐ కార్యకర్తల వాదన ప్రకారం, ప్రధానమంత్రి వంటి ప్రజాప్రతినిధుల విద్యార్హతలు ప్రజలకు తెలియాల్సిన అంశమని అంటున్నారు. 2016 డిసెంబర్ 21న సీఐసీ, 1978లో బీఏ పాసైన వారి రికార్డులను పరిశీలించాలన్న ఆదేశాలు జారీ చేయగా, అదే ఏడాది మోదీ తన డిగ్రీ పూర్తిచేసినట్లు రికార్డుల్లో ఉంది.

## డిసెంబర్ 6వ తేదీకి ఉగ్ర ప్రణాళిక!

ఆయన భావించినట్లు ఆధారాలు బయటపడ్డాయి. ఎర్రకోట పేలుడు కేసులో సుమారు ఎనిమిది మందిని విచారించిన అనంతరం అధికారులు కీలక సమాచారాన్ని పొందారు. ఫరీదాబాద్ కేంద్రంగా పనిచేసే అంతర్రాష్ట్ర వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌తో డాక్టర్ ఉమర్ నబీకు సంబంధాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 360 కేజీల అమోనియం నైట్రేట్ కేసులో అరెస్టయిన మరో డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. ఆ అరెస్టులతో భయాందోళనకు గురైన ఉమర్ నబీ ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు అధికారులు పేర్కొన్నారు.

**- టర్కీ ట్రిప్ నుంచి ఉగ్ర మార్గం**

2021లో ముజమ్మిల్‌తో కలిసి ఉమర్ నబీ టర్కీ పర్యటనకు వెళ్లినట్లు సమాచారం. ఆ ట్రిప్ అనంతరం ఆయన తీవ్రవాద భావజాలానికి లోనైనట్లు గుర్తించారు. టర్కీలో జైషే మొహమ్మద్ ఉగ్ర గ్రూప్ సభ్యులతో ఆయన సంబంధాలు ఏర్పరచుకున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. తిరిగి భారత్‌కు వచ్చాక, అమోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్ వంటి పేలుడు పదార్థాలను సేకరించి ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ క్యాంపస్ సమీపంలో నిల్వ చేయడం ప్రారంభించాడు.

**- డిసెంబర్ 6 కుట్ర వెనుక ఉద్దేశం**

తన సహచరులకు ఉమర్ నబీ డిసెంబర్ 6న జరపబోయే ఉగ్ర దాడి గురించి చెప్పినట్లు పోలీసులు చెబుతున్నారు. వాహన ఆధారిత ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైస్‌లు తయారు చేయడంలో నిపుణత సాధించిన ఆయన, ఇంటర్నెట్ ద్వారా బాంబ్ తయారీ పద్ధతులు నేర్చుకున్నాడు. సోమవారం రాత్రి దాడి చేసే ముందు ఢిల్లీలోని ఒక మసీదులో మూడు గంటల పాటు గడిపినట్లు ఆధారాలు లభించాయి. శ్రీనగర్‌లో జైషే మొహమ్మద్‌కు మద్దతుగా వెలిసిన పోస్టర్ల కేసు విచారణలో ఈ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ గుట్టు పూర్తిగా బయటపడింది.

## సాయం చేయండి

శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు పీవీఎన్ మాధవ్ వినతి పత్రం అందజేశారు. తక్షణ కేంద్ర సహాయం, దీర్ఘకాలిక వ్యవసాయ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం నుండి రూ.1000 కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీ వెంటనే మంజూరు చేయించాలని పీవీఎన్ మాధవ్ విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట ప్రసాద్, బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, విశాల్ మోర్చా నాయకులు వైవీ సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరులో భారీ ర్యాలీ

మన గళం, పుత్తూరు : మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో ఉదయం పుత్తూరు విష్ణుమహల్ థియేటర్ వద్దుగా దేశవ్యాప్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు గురి చేయడాన్ని నిరసిస్తూ భారీ ర్యాలీ జరిగింది. నగరి నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి పాదయాత్రలో పాల్గొన్నారు. ర్యాలీకు సంఘటనలో ప్రజాసంగ్రామంగా స్థానిక పార్టీ శ్రేణుల పాటు విస్తృత సహకారం జరిగింది.

ఆర్కే రోజా చేసిన ప్రకటనల ప్రకారం, ప్రభుత్వం జారీ చేసిన జీ ఓ 590 రద్దు చేయకపోతే పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆయన పేర్కొనగా, మెడికల్ సీట్లు ప్రైవేట్ రంగానికి ఇచ్చితే పేద విద్యార్థులు భవిష్యత్తులో కోట్లాది రూపాయలతో సీట్లు కొనాల్సిన పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందిబీ పేద ప్రజలు నాణ్యమైన వైద్యం అందుకోలేరనే ఆందోళన ఇప్పుడు విద్యార్థుల పరిపాలనలో ఉంది. ఈ విషయాన్ని ముఖ్యంగా ప్రతిపక్షం ఆరోపిస్తున్న దిశగా రోజా విజృంభించారు.

రాజకీయ తప్పులపై కూడా ఆయన తీవ్రంగా విమర్శలు చేసారు. గత కోమల ప్రభుత్వాలప్పుడు మెడికల్ కాలేజీల ఏర్పాట్లపై అస్పష్టత ఉందని, ఈఖాళీని నింపేందుకు ఇప్పటి ప్రభుత్వం వచ్చినప్పటికీ కొన్ని కాలేజీలు పూర్తిగా ప్రారంభంకాని పరిస్థితి ఉన్నట్లు ఆరోపించారు. చెలామణి రాజకీయ నేతలపై ఋణపూరిత నిర్ణయాల వల్ల ప్రజల వనరులు కొల్లగొడుతున్నట్టు, ఆయా వర్గాల బినామీలకు లబ్ధి చేరుతున్నట్టు తీవ్రమైన ఊహాగానాలు చెప్పారు.

# విజయానికి విద్య కీలకం





సమాజం కూడా ప్రయోజనం పొందుతుందన్నారు. ప్రభుత్వం బాలికల విద్య, లింగ సమానత్వానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికల విద్య ను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, దీని వల్ల సమాజానికి మేలు కలుగుతుందని గవర్నర్ పేర్కొన్నారు. విద్య బలమైన, ఆరోగ్యకరమైన సృజనాత్మక, అభివృద్ధి చెందిన సమాజాన్ని సృష్టించడానికి ఉపయోగపడే శక్తివంతమైన సాధనం అన్నారు. క్రమశిక్షణ, సమయ నిర్వహణ ద్వారా జీవితంలో విజయం సాధించబడుతుందన్నారు. పాఠశాలలు ఈ లక్షణాలను విద్యార్థులకు చిన్నప్పటి నుండే నేర్పించాలని, విద్యార్థులు సమయాన్ని సమర్థవంతంగా నిర్వహించడం లాంటివి నేర్పించాలన్నారు. ఈ నైపుణ్యాలు నేటి వృత్తిపరమైన ప్రపంచంలో చాలా ముఖ్యమైనవి అని గవర్నర్ పేర్కొన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు పట్టణంలో 50 సంవత్సరాల క్రితమే దివంగత కల్యాణమ్మ మాంటిస్సోరీ పాఠశాలకు పునాది వేశారన్నారు. ఇప్పుడు 50 సంవత్సరాల తర్వాత మాంటిస్సోరీ విద్యా సంస్థలు అనేక బ్రాంచ్ లు ప్రారంభించి వేలాది మంది విద్యార్థులకు చదువును నేర్పిస్తున్నారని తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాంటిస్సోరి విద్యాసంస్థలు విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యా మార్పులకే భవిష్యత్తు దిశ

తూ, "యువత తమ కలల సాధన కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలి. కష్టపడితే ఏ అడ్డంకీ ఆపలేనిది. విద్య కేవలం సర్టిఫికెట్ కోసం కాదు, సమాజ మార్పు కోసం ఉపయోగపడాలి" అని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, అందుకే ఉన్నత విద్యను సమకాలీన అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విద్యా రంగంలో సంస్కరణలు తప్పనిసరని మంత్రి పేర్కొన్నారు. "విద్యార్థుల్లో ఆవిష్కరణా దృక్పథం, సాంకేతిక నైపుణ్యం పెంపొందించే విధంగా విద్యా వ్యవస్థ రూపకల్పన కావాలి. దీనికి విద్యావేత్తలు, పరిశ్రమలు కలిసి కృషి చేయాలి" అని లోకేష్ అన్నారు. ప్రభుత్వం విద్యా రంగం బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తోందని, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరిస్తోందని తెలిపారు. ఈ కాంక్లేవ్‌లో సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్ అశ్విన్ మహాలింగం, విట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ సెల్వం, ఫస్ట్‌జెన్ ఫౌండర్ %ు% సీఈఓ ఫిలిప్ ఆస్మస్, ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కె. రత్నశీలామణి, సీఐఐ ఏపీ వైస్ చైర్మన్ శరణం నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఉన్నత విద్యా అభివృద్ధికి సంబంధించిన కీలక సిఫారసులు ఆమోదించబడ్డాయి.



# నిడదవోలు యువతి కైవల్యకు అంతరిక్ష యాత్రలో అరుదైన గౌరవం

**- ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుంచి 150 మందిలో ఒకరైన తెలుగు యువతి**

**- ఎంపికలేఖతో కలసిన కైవల్యకు కందుల దుర్గేష్ అభినందనలు**

మన గళం, నిడదవోలు : పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు యువతి కుంచాల కైవల్య రెడ్డి అంతరిక్ష యాత్రకు ఎంపిక కావడంతో తెలుగు రాష్ట్రాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఫ్లోరిడాలోని టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాంలో పాల్గొనే అరుదైన అవకాశం ఆమెకు లభించింది. ఈ సందర్భంగా ఆమె నిడదవోలు రోటరీ ఆడిటోరియంలో తల్లిదండ్రులతో కలిసి కందుల దుర్గేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా దుర్గేష్ కైవల్యకు ఫ్లోరిడా నుంచి వచ్చిన ఎంపిక లేఖను పరిశీలించి, ఆమె ప్రతిభను ప్రశంసించారు. "ఇంత చిన్న వయస్సులో అంతరిక్ష రంగంలో ఇంతటి గుర్తింపు పొందడం గర్వకారణం. కైవల్య కృషి, దృఢసంకల్పం నేటి యువతీ యువకులకు స్ఫూర్తిగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.

**- ప్రపంచస్థాయి పోటీలో తెలుగు అమ్మాయి విజయం**

ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుండి వేలాది మంది విద్యార్థులు ఈ ప్రోగ్రామ్ కోసం పోటీపడగా, కేవలం 150 మందికే అవకాశం లభించింది. వారిలో ఒకరుగా తెలుగు అమ్మాయి కుంచాల కైవల్య రెడ్డి ఎంపిక కావడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొనడం ద్వారా కైవల్య అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంపై లోతైన అవగాహన పొందనుంది. కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "కైవల్య భవిష్యత్తులో ఖగోళ శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి సేవలందించాలని కోరుకుంటున్నాను" అన్నారు. ఆమె తల్లిదండ్రులు కుమార్తె సాధన పట్ల గర్వం వ్యక్తం చేశారు. కైవల్య విజయంతో నిడదవోలు పట్టణం అంతా హర్షాతిరేకంలో మునిగిపోయింది.



## చంద్రబాబు వంచనపై యువత ఆగ్రహం

మన గళం, చిత్తూరు : ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ పథకంలోకి తేవాలనే ప్రభుత్వ నిర్ణయంపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. చిత్తూరులో పార్టీ ఇంచార్జ్ విజయానందరెడ్డి నేతృత్వంలో విద్యార్థులు, యువత, మహిళలు, వైయస్ఆర్ సీపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. గంగినేని చెరువు వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. పాల్గొన్న ప్రజలు "మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దు చేయాలి" అంటూ గట్టిగా నినదించారు. ర్యాలీలో వైయస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. "స్వాతంత్ర్య భారత చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా 17 మెడికల్ కాలేజీలను సాధించి జాతికి అంకితం చేసిన వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. ఈ కాలేజీలను చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజా సంపదను వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించాలనే కుట్రను రాష్ట్ర ప్రజలు అంగీకరించరు" అని మండిపడ్డారు. ఇంకా విజయానందరెడ్డి మాట్లాడుతూ, పీపీపీ విధానం పేరుతో మెడికల్ కాలేజీలను ప్రైవేటు రంగానికి అప్పగించడం అనేది పేద విద్యార్థులపై తీవ్రమైన అన్యాయం అని తెలిపారు. వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో ప్రజా సంక్షేమం కోసం పని చేసిందని గుర్తుచేస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం పేదల ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు. ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి, వ్యక్తిగత లాభాల కోసం ప్రభుత్వ నిర్ణయాలు తీసుకుంటే వైయస్ఆర్ సీపీ నిరసనలు మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.


# సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం



- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



మనగళం, కర్నూలు సిటీ : పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలం చింతలముని కాలనీ 35 వ వార్డు లో గృహ ప్రవేశాల కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 1.5 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 1 సెంటు మాత్రమే ఇచ్చారని, అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు అర్బన్ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలం కేటాయిస్తోందని తెలిపారు. అదేవిధంగా, ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. బీసీ, ఎస్సీలకు రూ. 50,000 కంటే ఎక్కువ, ఎస్టీలకు రూ,75,000 వరకు, కొన్ని ప్రత్యేక గిరిజన తెగలకు రూ. లక్ష వరకు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం టిడ్కో ప్రాజెక్టులలో మౌలిక వసతులు పూర్తి చేసి, ప్రజలకు ఇళ్లు అందజేయడానికి కట్టుబడి ఉందన్నారు. మార్చి చివరి నాటికి లబ్ధిదారులందరికీ ఇళ్లు నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణం చేపడుతున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 900 అర్బన్ కు సంబంధించి 501 ఇళ్లు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. అలాగే, ఈ నెల 17వ తేదీన టిడ్కోలో200 ఇళ్లు లబ్ధిదారులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, పేదల గృహస్వప్నాలను సాకారం చేయడంలో ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ....రాష్ట్రవ్యాప్తంగా గృహనిర్మాణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని తెలిపారు. త్వరలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)%-%రూరల్ కింద గృహనిర్మాణాలు ప్రారంభం కానున్నాయని జేసీ తెలిపారు. ఇంకా ఇల్లు లేని అర్హత కలిగిన వారు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పీఎంఏవై పథకానికి తోడ్పాటుగా సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రిని తక్కువ ధరకే అందించేందుకు వివిధ కంపెనీలతో భాగస్వామ్యం ఏర్పరచిందని తెలిపారు. అలాగే ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని పేర్కొన్నారు. ప్రతి గృహనిర్మాణానికి రూ. 2.50 లక్షల నుండి రూ. 3.00 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించబడుతుందని, పొదుపు సంఘాల ద్వారా బ్యాంక్ రుణాలు అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి చివరి నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగా కర్నూలు జిల్లాలో 70 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అనే కల సాకారం కావడానికి ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తోందని,ఎవరికైనా ఇంకా ఇల్లు రాకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. అనంతరం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు మంజూరైన లావణ్య, కుమ్మరి లక్ష్మి, ఏం. కమలమ్మ, మమతా, బి. సంధ్య తదితరులకు శాంక్షన్ లెటర్ లు అందజేశారు. బి. కృష్ణ వేణి, రేణుక ఇళ్లకు జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే గృహ ప్రవేశాలు చేయించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చిరంజీవి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, డిఆర్డిఏ పిడి తదితరులు పాల్గొన్నారు.



## సకల సదుపాయాలతో టిడ్కో గృహాలు

- 17వ తేదీన 187 మంది లబ్ధిదారులకు గృహాలు అప్పగింత
- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్





మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగర శివార్లలోని ఎన్టీఆర్ కాలనీ టిడ్కో గృహాలను అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దామని, ఈ నెల 17వ తేదీన 187 మంది లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. బుధవారం ఆయన టిడ్కో గృహాలను పరిశీలించారు. మరమ్మత్తులు, సదుపాయాలు, పనుల నాణ్యతలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టిడ్కో కాలనీలో రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, రేషన్, పింఛన్, శుద్ధితాగునీరు వంటి సదుపాయాలను పూర్తిచేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు సౌకర్యవంతంగా నివసించేలా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. గృహాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించారని వివరించారు. ఇటీవల మంత్రులు నారాయణ, టీజీ భరత్ సమీక్షలో తీసుకున్నా నిర్ణయంలో భాగంగా 976 మందికి టిడ్కో గృహాలను అప్పగించాల్సి ఉందని, తొలుత 17న 187 మంది లబ్ధిదారులకు అప్పగించి, తర్వాత ప్రతివారం కొంతమంది లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈ మనోహర్ రెడ్డి, టిడ్కో ఈఈ సూర్య నారాయణ, డీఈలు గుప్తా, నరేష్, టిడ్కో అధికారి పెంచలయ్య, శానిటేషన్ ఇన్ స్పెక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లలోకి 'గ్రో' గ్రాండ్ ఎంట్రీ..

న్యూఢిల్లీ,నవంబర్12 ,మనగళం:: స్టాక్ బ్రోకింగ్ సంస్థ గ్రో పేరెంట్ కంపెనీ బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ స్టాక్ ఈరోజు స్టాక్ మార్కెట్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. అంచనాలను అందుకుంటూ ఈ కంపెనీ షేర్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇవాళ 14 శాతం ప్రీమియంతో దలాల్ స్ట్రీట్‌లోకి అడుగు పెట్టాయి. ఈ గ్రో ఐపీఓ ఇష్యూ ధర రూ.100తో పోలిస్తే ఎన్ఎస్ఈలో 12 శాతం ప్రీమియంతో రూ.112 వద్ద ట్రేడింగ్ ప్రారంభించగా, ఇక బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలో రూ. 114 వద్ద లిస్టయ్యాయి.గ్రో పబ్లిక్ ఇష్యూకు సబ్‌స్క్రిప్షన్‌లో మంచి ఆదరణ లభించింది. ఐపీఓ గరిష్ఠ ధర వద్ద రూ. 6,632 కోట్ల నిధులు సమీకరించే లక్ష్యంగా పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఈ పబ్లిక్ ఇష్యూ నవంబర్ 4వ తేదీన సబ్‌స్క్రిప్షన్ మొదలు పెట్టింది. మొత్తం ఈ ఐపీఓలో 36.47 కోట్ల షేర్లను విక్రయించింది. అయితే, ఐపీఓ సబ్‌స్క్రిప్షన్‌లో ఇన్వెస్టర్ల నుంచి విశేషమైన స్పందన లభించింది.

## రజకుల సమస్యలు పరిష్కరించాలి



మనగళం, కర్నూలు సిటీ : రజకుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్రఅధ్యక్షుడు సి. గురుశేఖర్ కోరారు. ఏపీ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా కమిటీ సమావేశం బుధవారం వీరనారి ఐలమ్మ కార్యాలయంలో జిల్లా ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పెద్దలు రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించారని ఆరోపించారు. రజకుల సంక్షేమానికి రూ. 10వేల కోట్లు కేటాయించాలని, ఆదరణ -3 పథకం ద్వారా రజక వృత్తిదారులకు అవసరమైన ఆధునిక పరికరాలను అందివ్వాలని, యాభైఏళ్లు నిండిని ప్రతి రజక వృత్తి దారునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన జీవో నెంబర్ 27 ప్రకారము కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులను రజకులతో భర్తీ చేయాలని, చెరువులపై రజకులకే హక్కులు కల్పించాలన్నారు. కూటమి సర్కార్ పెద్దలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఛలో అసెంబ్లీ నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా సహకార్యదర్శి సి శేషాద్రి రాముడు, జయమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు బాబు శేఖర్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎల్లయ్య, రేమట రామాంజనేయులు, హరి, చిదానంద, పుష్ప, రేణుక, నాగరాజు, ఎల్లా కృష్ణ, బజారి, ఎల్లప్ప, భీమన్న, తదితర నాయకులు పాల్గొన్నారు.

## బహిరంగప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

మనగళం, కర్నూలు క్రైం : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కల్గిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూలు పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. రోడ్లు, నడకదారులు, పార్కులు, వ్యాపార దుకాణ సముదాయాలు, శివారు ప్రాంతాలు తదితర ప్రాంతాలను పోలీసులు పరిశీలించారు. మద్యం సేవిస్తున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజాజీవనానికి ఆటంకం కలిగించే మద్యం ప్రియులపై పబ్లిక్ న్యూసెన్స్ కింద కేసులు నమోదు చేశారు.

## మృతుడు రఘువరన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

మనగళం, కర్నూలు సిటీ : ఆత్మహ్యాకు పాల్పడిన రఘువరన్ కుటుంబాన్ని ఐటీసీ కంపెనీ ఆదుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఐటీసీ ప్రతినిధుల ఒత్తిడి మూలంగానే ఎగ్జిక్యూటివ్ గా విధులు నిర్వర్తిస్తున్న రఘువరన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఈ మేరకు కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రఘువరన్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించామన్నారు. మంగళవారం అంత్యక్రియలు పూర్తయ్యాయన్నారు. ఐటీసీ ప్రతినిధుల ఒత్తిడి మితిమీరిందని మృతుడు ఆందోళన వ్యక్తం చేశారని, ఇంటి పెద్దదిక్కు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ఆ కంపెనీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఐటీసీ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రభుత్వం నుంచి సాయం అందజేయాలని అధికారులను కోరారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ నేత్రాలు దానం చేసిన మృతుడి కుటుంబ సభ్యులను వారు అభినందించారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు హుస్సేన్ బాషా, సహాయ కార్యదర్శి ప్రకాష్, నాయకులు అంజి పాల్గొన్నారు.



# శక్తి యాప్ , వాట్సప్ సేవలపై అవగాహన

మనగళం, కర్నూలు క్రైం : మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్, శక్తి వాట్సాప్ నంబర్ల పై పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ ల అధికారులు, శక్తి టీం బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు విద్యార్థినిలకు , మహిళలకు వాటి సేవలను పోలీసులు వివరిస్తున్నారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఉపేంద్ర బాబు పర్యవేక్షణలో శక్తి టీం బృందాలు మహిళలకు, బాలికలకు పాఠశాల, కళాశాలలో విద్యార్థినిలకు శక్తి యాప్, సైబర్ నేరాలు , గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, ఈవ్ టీజింగ్ లపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో శక్తి టీం బృందాలు జన సంచారం ఉన్న ప్రాంతాలతో పాటు, పలు పాఠశాలల్లో విద్యార్థులకు డయల్ 112, డయల్ 100,1098, 1930, శక్తి యాప్ , మహిళలు అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శక్తి" వాట్సప్ 7993485111 నెంబర్ ను మహిళలు, చిన్నారుల భద్రత కోసం సేవ్ చేసుకోవాలన్నారు. ఎక్కడైనా గంజాయి , డ్రగ్స్, మాదకద్రవ్యాల సేవించడం చూసినా విక్రయాలు, వినియోగం గురించి సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు అందించాలన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ మధ్య తేడా, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు , మహిళలపై జరిగే నేరాల పై మరియు చట్టాల పై అవగాహన కల్పించారు. 2025 జనవరి నెల నుండి నవంబర్ 12 వ తేదీ వరకు శక్తి యాప్ ను జిల్లాలో 19,251 మంది డౌన్లోడ్ చేసుకున్నారని జిల్లా ఎస్పీ తెలిపారు.



# సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు





మనగళం, కర్నూలు సిటీ : జయ గురుదత్త శ్రీ గురుదత్త కర్నూలు సూర్యనారాయణ స్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్లేష నక్షత్రం సందర్భంగా ఆశ్లేష బలి సర్ప శాంతి నాగ మండల పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన సేవకర్తలుగా గణపతి రావు లావణ్య దంపతులు పాల్గొన్నారు. పూజానంతరం సుబ్రమణ్య స్వామి తీర్ధప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై నిరసన ర్యాలీ భారీగా తరలివచ్చిన వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు






మన గళం కోడుమూరు: ప్రభుత్వ కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం కోడుమూరులో వైఎస్ఆర్‌సీపీ తలపెట్టిన నిరసన ర్యాలీలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, మేథావులు సామాజిక కార్యకర్తలు కదంతొక్కారు. వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ ఎస్ఈసీ సభ్యుడు, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో కోడుమూరు పట్టణంలో తలపెట్టిన నిరసన ర్యాలీకి అన్ని మండలాల నుంచి అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా కదలివచ్చారు. ప్రధాన వీధుల వెంట వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ గారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా 2019లో వైఎస్ జగన్ అధికారం చేపట్టాక ఒకేసారి ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వీటిలో 5 మెడికల్ కళాశాలలను 2023%-%24లో గత ప్రభుత్వంలోనే ప్రారంభించారని చెప్పారు. తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లను మాజీ సీఎం వైఎస్ జగన్ మన విద్యార్థులకు అదనంగా సమకూర్చారని గుర్తు చేశారు. ప్రజలకు చేరువలో మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వాస్పత్రులను బోధనాస్పత్రులుగా బలోపేతం చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య కళాశాలలకు గ్రహణం పట్టుకుందని ధ్వజమెత్తారు. చంద్రబాబు కక్షపూరిత విధానాలతో రెండేళ్లలో రాష్ట్రం ఏకంగా 2,450 ఎంబీబీఎస్ సీట్లను కోల్పోయిందన్నారు. రూ. లక్ష కోట్ల విలువైన సంపద లాంటి ప్రజల ఆస్తులను పచ్చ కార్పొరేట్ గద్దలకు దోచిపెట్టడం కోసం చంద్రబాబు పీపీపీ కుట్రలు పన్నారని ఆరోపించారు. ఏకంగా 10 కొత్త వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, ఇందుకు కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలే నిదర్శనమన్నారు. అన్ని వర్గాల ప్రజల మద్దతు కూడగట్టి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. కోడుమూరు నియోజకవర్గం భారీ ఎత్తున సుమారు మూడు వేల పైన జనాలను సమీకరించి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు, కర్నూలు నియోజకవర్గ అబ్జవర్ కర్ర హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణి గాంధీ, 40 వ కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమ్ సింహారెడ్డి, గూడూరు మున్సిపల్ చైర్మన్ జె వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న, జెడ్పిటిసిలు రఘునాథ్ రెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్, ఎంపీపీలు సునీతమ్మ, రూతమ్మ, జిల్లా అధికార ప్రతినిధి పోలకల్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పాటిల్ హనుమంతు రెడ్డి, శివరాముడు, డి వాసు, రేమట సంపత్ కుమార్, మండల కన్వీనర్లు రమేష్ నాయుడు సోమశేఖర్ రెడ్డి మోహన్ బాబు రామాంజనేయులు గూడూరు టౌన్ కన్వీనర్ అబెల్, యువజన జిల్లా ఉపాధ్యక్షులు సోమ శేఖర్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ, జిల్లా కమిటీ నాయకులు , కోడుమూరు నియోజకవర్గ అనుబంధంలో విభాగాల నాయకులు, అన్ని మండలాల అనుబంధ విభాగాల అధ్యక్షులు, గ్రామ కమిటీలు నాయకులు, కోడుమూరు నియోజకవర్గం, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, రైతులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# టాటా బైక్స్ వస్తున్నాయా? కంపెనీ ఇచ్చిన క్లారిటీ!



న్యూఢిల్లీ,నవంబర్12, మన గళం::: దిగ్గజ కార్ మేకర్ టాటా మోటార్స్.. ఇటీవల ద్విచక్ర వాహన రంగంలోకి ప్రవేశిస్తుందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను పోలి ఉండేలా 125%ఎ౩% బైక్‌ను చాలా తక్కువ ధరకే విడుదల చేయబోతోందంటూ విస్తృతంగా సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొట్టాయి. దీనిపై అధికారికంగా టాటా మోటార్స్ కీలక ప్రకటన చేసింది. అవన్నీ వదంతులేనని.. స్పష్టం చేసింది.దేశంలోనే అత్యంత విలువైన, విశ్వసనీయ సంస్థల్లో టాటా గ్రూప్ అన్నింటికంటే ముందు వరుసలో ఉంటుంది. చాలా మంది ఇదే చెబుతుంటారు. నాణ్యతకు మారుపేరుగా ఈ సంస్థ ఉంటుందని అంతా నమ్ముతుంటారు. ఆ గ్రూప్ నుంచి వచ్చే ప్రొడక్ట్స్‌పై ప్రజలకు నమ్మకం ఎక్కువే ఉంటుంది. దాదాపు అన్ని రంగాల్లో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్న టాటా గ్రూప్ గురించి ఇటీవల కొన్ని నకిలీ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అదే దిగ్గజ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్.. ద్విచక్ర వాహన రంగంలోకి ప్రవేశిస్తుందని వార్తలు రావడం. కొద్ది రోజులుగా దీనికి సంబంధించి.. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. టాటా గ్రూప్ లోగోతో.. బైక్స్ ఉన్నట్లు సోషల్ మీడియాలో ఫొటోలు కూడా దర్శనం ఇచ్చాయి. దీంతో ఇది నిజమనే చాలా మంది అనుకున్నారు.ముఖ్యంగా టాటా బైక్స్.. ప్రముఖ రాయల్ ఎన్‌ఫీల్డ్ లుక్‌లో తీసుకొస్తోందని.. దేశంలోనే అత్యంత చౌకగా రూ. 60 వేల లోపు ధరకే 125%ఎ౩% మోటార్ సైకిల్‌ను ఆవిష్కరించిందని ప్రచారం జరిగింది. ఈ బైక్ మైలేజీ ఏకంగా 90 కిలో మీటర్లుగా ఉంటుందని కొన్ని మోసపూరిత వెబ్‌సైట్స్, సోషల్ మీడియాల్లో కనిపించడంతో నిజమని నమ్మారు చాలా మంది. అయితే చాలా రోజులకు.. తమ బ్రాండ్‌పై పెరుగుతున్న తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేసేందుకు టాటా మోటార్స్ దీనిపై కీలక ప్రకటన చేసింది. టాటా మోటార్స్ ద్విచక్ర వాహన రంగంలోకి ప్రవేశించడం లేదని సంస్థ అధికారింగా ఖండించింది. దీని గురించి టాటా మోటార్స్ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది. తమకు ద్విచక్ర వాహన రంగంలోకి ప్రవేశించాలనే ప్రణాళికలు ఏమీ లేవని క్లారిటీ ఇచ్చింది. టాటా మోటార్స్‌కు సంబంధించి.. ఏమైనా ఎలక్ట్రిక్, ప్యాసింజర్ వెహికిల్స్‌కు సంబంధించిన సమాచారం తమ అధికారిక వెబ్‌సైట్లలో మాత్రమే చూడాలని పేర్కొంది. దీంతో టాటాల నుంచి బైక్స్ రావట్లేదని జనానికి ఒక క్లారిటీ వచ్చింది.ఇప్పటికే టాటాల నుంచి బైక్స్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన ఫొటోలు నకిలీవి అని.. పలు ఫ్యాక్ట్ చెక్ టూల్స్ స్పష్టం చేశాయి. దీనిని పలు మీడియాలు కూడా పేర్కొన్నాయి. ప్రస్తుతానికి టాటా మోటార్స్.. ప్యాసింజర్, కమర్షియల్, ఎలక్ట్రిక్ వాహనాల్లో 4- వీలర్‌పైనే దృష్టి సారించింది. ఇటీవల టాటా మోటార్స్.. రెండు సంస్థలుగా విడిపోయింది. ప్యాసింజర్ వెహికిల్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ కలిసి టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ లిమిటెడ్‌గా.. ఇదే సమయంలో టాటా మోటార్స్ కమర్షియల్ వెహికిల్స్ లిమిటెడ్ అనే మరో కంపెనీగా వేరైంది. ఆ విభజన సమయంలోనూ టూ- వీలర్స్ గురించి ఎలాంటి ప్రకటనా చేయలేదు.

# ఘనంగా నూతన కమిటీ సభ్యుల ప్రమానస్వీకారోత్సవం





మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు పట్టణం నంద్యాల చెక్ పోస్ట్ దేవి ఫంక్షన్ హాల్ లో బుధవారం టీడీపీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. పాణ్య%శీ% ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గం ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డి సమక్షంలో బూత్, క్లస్టర్, యూనిట్,గ్రామ, మండలాలకు సంబంధించి నూతన కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గౌరు దంపతులను సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో ఓర్వకల్లు,కల్లూరు, పాణ్య%శీ%,గడివేముల నూతనమండల అధ్యక్షులు,గ్రామ కమిటీ సభ్యులు,బూత్, క్లస్టర్, యూనిట్ ఇంచార్జి లు,16 వార్డ్ ల బూత్,క్లస్టర్,యూనిట్ ఇంచార్జి లు ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టఫే కొత్త ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్

న్యూఢిల్లీ,నవంబర్12 మనగళం,
భారత వ్యయసాయయంత్రాల తయారీ దిగ్గజం ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విపమెంట్ లిమిటెడ్ (టఫే) కొత్త తరం ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్ 'ఈవీఎక్స్ 75'ను విడుదల చేసింది. జర్మనీలో జరుగుతున్న అగ్రిటెక్నికా-2025 ప్రదర్శనలో ఈ కొత్త మోడల్‌ను కంపెనీ ఆవిష్కరించింది. 75 హెచ్‌పీ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్, ఈయూ స్టేజ్-5 డీజిల్ ఇంజన్, 400 వోల్ట్ ఎలక్ట్రిక్ బ్యాటరీ సిస్టమ్‌తో రూపొందించినట్లు టఫే తెలిపింది. లిక్విడ్ కూల్డ్ హై-వోల్టేజ్ సిస్టమ్, 3-స్పీడ్ ట్రాన్స్‌మిషన్ (గరిష్ట వేగం గంటకి 40 కి.మీ), ఫుల్ హెచ్‌వీఏసీ క్యాబిన్, ఎలక్ట్రో-హైడ్రాలిక్ రియర్ లిఫ్ట్, ఇండిపెండెంట్ పీటీవో వంటి ఫీచర్లతో ఈ కొత్త ట్రాకర్ట్ వస్తున్నట్టు కంపెనీ వైస్ ఛైర్మన్ డా. లక్ష్మీ వేణు తెలిపారు.

# సంపాదకీయం

## ప్రపంచ దయా దినోత్సవం.. మనుష్యత్వం మళ్లీ గుర్తు చేసుకునే రోజు

**– దయతో నిండిన ప్రపంచం కోసం ఒక్క అడుగు మనదైనా ఉండాలి.**

మనుషుల మధ్య పెరుగుతున్న చల్లదనానికి వేడి జోడించే ప్రయత్నం. ఆధునిక ప్రపంచం వేగంగా మారిపోతోంది. సాంకేతికత, ఆర్థిక పోటీ, వ్యక్తిగత ఆందోళనల నడుమ "దయ" అనే పదం కొన్నిసార్లు పాతకాలపు విలువలా కనిపిస్తోంది. కానీ మనిషి ఉన్నంత వరకు మానవత్వం ఉండాలి. ఈ దినం మనలో మానవీయతను మేల్కొలిపే సందర్భం. "దయ" అనేది కేవలం దానం కాదు ు అది మనసు స్థాయి, ఒక ఆలోచనా ధోరణి, ఒక సాంస్కృతిక ధర్మం.

దయ అంటే కేవలం ఎవరినైనా ఆదుకోవడం మాత్రమే కాదు. అది వినిపించడం కూడా. నేటి సమాజంలో ఎవరికీ సమయం ఉండడం లేదు. చుట్టూ విన్నా, చూసినా ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక దుఃఖం, ఒక పోరాటం తీసుకుని నడుస్తున్నారు. అలాంటి సమయంలో మనం ఒక చిరునవ్వు ఇచ్చినా, ఒక సాంత్వన మాట పలికినా, అది ఆ మనిషికి ప్రపంచాన్ని మార్చినంత ప్రభావం చూపుతుంది. ప్రపంచ దయా దినోత్సవం అదే విషయాన్ని మనకు గుర్తు చేస్తుంది. చిన్న సహాయం, పెద్ద ప్రభావం.

దయా దినోత్సవం ఉద్భవం 1998లో జపాన్‌లో జరిగిన "వరల్డ్ కైండ్నెస్ మూవ్‌మెంట్" నుండి ప్రారంభమైంది. ఈ ఉద్యమం లక్ష్యం స్పష్టంగా ఉంది. "మానవ సంబంధాల్లో సహానుభూతిని పెంచడం." పాఠశాలల్లో, కార్యాలయాల్లో, ప్రభుత్వాల్లో దయను ఒక సాంస్కృతిక విలువగా ప్రోత్సహించాలి అనే భావనతో ఇది ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రపంచ దేశాలు ఒక్కొక్కటిగా దీనిలో భాగమయ్యాయి. మన దేశం భారత్ కూడా దయ, కరుణ, సర్వజన హిత భావనలో ముందే నిలిచినదే. భారతీయ తత్వశాస్త్రం, బౌద్ధం, జైనం, హిందూ ధర్మాలు ు అన్నీ "అహింస, కరుణ" అనే మూలవాక్యాల మీదే నిలబడ్డాయి. "మనం ఇతరులకు చేసేది మనకే తిరిగి వస్తుంది" అనే సూత్రం భారతీయ మనస్తత్వానికి బలమైన పునాది. కానీ నేటి ప్రపంచంలో ఆ విలువలు కొంచెం కొంచెంగా తగ్గిపోతున్నాయి. సాంఘిక మాధ్యమాల యుగంలో మనం ఒకరిని నొప్పించడంలో వేగం చూపుతున్నాం కానీ ఓదార్చడంలో కాదు. అదే మారాలి.

ప్రపంచ దయా దినోత్సవం మనకు ఒక అవకాశం ు మనలోని మానవత్వాన్ని పునరుద్ధరించుకోవటానికి. ఈ రోజు ఎవరికి అయినా సహాయం చేయండి. అది డబ్బు కావచ్చు, సమయం కావచ్చు, లేక కేవలం ఒక శ్రద్ధతో కూడిన సంభాషణ కావచ్చు. ఈ చిన్నచిన్న చర్యలే సమాజంలో పెద్ద మార్పు తీసుకువస్తాయి. మనం ఒకరి మనసు మార్చగలిగితే, మనం ప్రపంచాన్నే మార్చినట్టే.

సమాజంలో దయ అనే విలువ తగ్గిపోవడానికి కారణం కేవలం మనం బిజీగా ఉండడమే కాదు, మనం "భావనలతో" ఉండడాన్ని మర్చిపోవడం కూడా. పిల్లలకు దయ, క్షమ, సహానుభూతి అనే విలువలు నేర్పించడంలో పాఠశాలలు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలి. దయను ఒక రోజు కాదు, ఒక అలవాటుగా మార్చడం అవసరం.

ప్రతి రంగంలో మనుషులు కొంచెం దయతో ప్రవర్తిస్తే ఎంత తేడా వస్తుందో ఆలోచించాలి. చర్చలలో కోపం కంటే సహనం, విమర్శల కంటే సమాధానం, ద్వేషం కంటే అర్థం చేసుకోవడమే మన మొదటి పాఠం కావాలి. ఇది కేవలం ఒక రోజు ఉత్సవం కాదు, ఇది ఒక మనస్తత్వం.

ప్రపంచ దయా దినోత్సవం ప్రతి ఒక్కరికీ ఒక జ్ఞాపకం మనం ఏ వృత్తిలో ఉన్నా, ఎక్కడ ఉన్నా, ఎవరి ఎదురైనా, దయతో ప్రవర్తించవచ్చు. ఎవరినైనా గౌరవంగా, సానుభూతితో, ప్రేమతో చూడటం మనిషితనానికి మించిన గౌరవం లేదు. ప్రపంచ దయా దినోత్సవం మనకు చెబుతోంది: దయ అనేది బలహీనత కాదు, అది మనిషి గొప్పతనానికి గుర్తు. ప్రతి రోజు మనం కొంచెం దయ చూపితే, ప్రపంచం కాస్త వెలిగిపోతుంది. ప్రపంచాన్ని మార్చాలంటే మన మనసు నుంచే మొదలుపెట్టాలి.

# రీసర్వేకు సహకారం అందించాలి

**– కొట్టాలచెరువు గూడెం దీర్ఘకాలిక భూసమస్య పరిష్కారం దిశగా చర్యలు – నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మన గళం, నంద్యాల/ఆత్మకూరు: జిల్లాలోని కొట్టాలచెరువు గూడెంలో దాదాపు నలభై సంవత్సరాలుగా పరిష్కారం కాని భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం కొట్టాలచెరువు గ్రామసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ గూడెం ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, హౌసింగ్ ఈఈ శ్రీహరి గోపాల్ తదితర అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కొట్టాలచెరువు గూడెంలో భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రీసర్వే బృందాలను ఏర్పాటు చేసి సర్వే ప్రక్రియ వేగవంతం చేస్తున్నామన్నారు. గూడెంలో ఉన్న దీర్ఘకాలిక భూవివాదాలను సమూలంగా పరిష్కరించేందుకు జిల్లా పరిపాలన కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ఈ క్రమంలో రీసర్వే బృందాలను నియమించామని, సర్వే ప్రక్రియలో గిరిజనులు పూర్తి సహకారం అందించాలన్నారు. గతంలో రీసర్వే పూర్తి చేయడానికి ఆరు నెలల సమయం పట్టేదని, ప్రస్తుతం ఆధునిక సాంకేతికతను వినియోగించి మూడు నెలల వ్యవధిలోనే సర్వే పూర్తి చేయగలుగుతున్నామన్నారు. సర్వే అనంతరం తుది ఆర్.ఓ.ఆర్ ఉత్తర్వులు జారీ కాగానే లబ్ధిదారుల పేర్లతో రికార్డులు నమోదు అవుతాయన్నారు. తద్వారా అడంగల్, 1-బి, పాస్‌బుక్, రాజముద్ర పత్రాలు అందుతాయని కలెక్టర్ తెలిపారు. రికార్డులో పేరు నమోదు కావడం వలన రైతులు ఈ-క్రాప్ బుకింగ్, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల లబ్ధిని సులభంగా పొందగలుగుతారన్నారు. ప్రస్తుతం రికార్డుల్లో పేర్లు లేని రైతులు కూడా నష్టపోకుండా చూసుకుంటున్నామన్నారు. అయితే రికార్డుల్లో పేరు నమోదు అయితే మరింత ఆర్థిక లబ్ధి పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. కొట్టాలచెరువు గ్రామంలోని 393.78 ఎకరాలను త్వరితగతిన రీసర్వే పూర్తి చేసి లబ్ధిదారుల పేర్లలో నమోదు చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద పంట పొలాలకు రహదారులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 56 మంది చెంచు కుటుంబాలకు గృహ పత్రాలను పంపిణీ చేసి గృహప్రవేశాలు నిర్వహించారు. పట్టాలు పొందిన భూములను ఇతరులకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ కొట్టాలచెరువు గూడెంలో దాదాపు నాలుగు దశాబ్దాలుగా పరిష్కారం కాని భూసమస్యలపై జిల్లా కలెక్టర్ చొరవ చూపి పునరావాసం, భూ హక్కుల పత్రాలు అందించే దిశగా కృషి చేస్తున్నారన్నారు. ఈ రీసర్వే ద్వారా గిరిజనులకు శాశ్వత హక్కులు లభిస్తాయని అన్నారు. అలాగే పెచ్చరుగు గూడెం నుంచి వచ్చిన గిరిజనులకు సాగు చేసుకునే భూములు కల్పించేందుకు కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.



# పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వండి

**– జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



మనగళం, నంద్యాల టౌన్ : జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా, విక్రయాల్లో పూర్తి పారదర్శకతతో చర్యలు చేపట్టి ప్రజలకు ఇసుక సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబరులో ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, జిల్లా మైనింగ్ అధికారి వేణుగోపాల్, కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్, ఆర్టీఓ శివారెడ్డి, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, గ్రౌండ్ వాటర్ అధికారి రఘురాం తదితర కమిటీ సభ్యులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా పర్యావరణానికి ఎటువంటి నష్టం కలగకుండా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మాత్రమే జరగాలన్నారు. తవ్వకాలు, రవాణా, నిల్వ మరియు విక్రయం మొత్తం ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, నందికొట్కూరు, నంద్యాల మండలాల్లో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ల రీన్యువల్ అంశాలను సమీక్షిస్తూ అందులో ఆళ్లగడ్డ, నంద్యాల స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు లేకపోవడం, పలు ఫిర్యాదులు రావడం, రికార్డుల నిర్వహణలో లోపాలు ఉన్న కారణంగా వాటి రెన్యువల్‌కు అవకాశం లేదని కలెక్టర్ తెలిపారు. నంద్యాల స్టాక్ యార్డ్ డిపో హోల్డర్‌ను పిలిపించి విచారణ జరపాలని మైనింగ్ ఎడిని ఆదేశించారు. ప్రజలకు ఇసుక సకాలంలో అందుబాటులో ఉండేలా సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఎలాంటి ఫిర్యాదులు లేకుండా, అందరికీ సమానంగా ఇసుక అందేలా చూడాలన్నారు. ప్రతి స్టాక్ యార్డ్ పాయింట్‌పై తరచూ తనిఖీలు జరిపి రికార్డులు సమగ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. డోన్ పట్టణంలో కొత్త ఇసుక స్టాక్ యార్డు ఏర్పాటుకు టెండర్లను పిలవాలన్నారు. మైనింగ్ శాఖ అధికారులు చురుకుగా వ్యవహరించి, జిల్లాలో మైనింగ్ కార్యకలాపాలు సమర్థవంతంగా కొనసాగేలా చూడాలని ఆదేశించారు. జిల్లాను రాష్ట్ర స్థాయిలో దిగువ స్థానంలో ఉంచకుండా క్రమబద్ధంగా పనులు చేపట్టాలన్నారు. రహదారుల ఇరువైపులా ఉన్న మైనింగ్ గుంతల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# పేదల సొంతింటి కల సాకారం



**– మంత్రి ఎన్ఎండి ఫరూక్**



మనగళం, నంద్యాల : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పేదలందరికీ ఇళ్ల నిర్మాణ పథకం కింద ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టిందని, పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తూ, రాష్ట్రంలో కోట్లాది మంది పేదలకు గూడు కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఈ రోజు పేదల సొంతింటి కల సాకారమవుతున్న పండుగ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటిస్తుందని, ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఎక్కడా లేని విధంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అందులో భాగంగానే నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో సొంతింటి కలను నెరవేర్చుకున్న మారెళ్ళ వైష్ణవి (లబ్దిదారుని పేరు) భర్త పేరు మారెళ్ళ ఆదినారాయణ వారి ఇంటిని ఈరోజు అధికారులతో కలిసి మంత్రి ప్రారంభించడం జరిగింది. అనంతరం నూతన గృహప్రవేశం చేసినందుకు మంత్రి ఎన్ఎండి ఫరూక్ మారెళ్ళ వైష్ణవి, మారెళ్ళ ఆదినారాయణ కు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ గత 16 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2,85,557 గృహాలను పూర్తి చేయడం జరిగిందని, ఇందులో ముఖ్యమంత్రి చొరవతో చేపట్టిన నిర్మాణాలు, పీఎంఏవై, బీఎల్సీ, పీఎంజేఎం పథకాల కింద పూర్తైనవి ఉన్నాయన్నారు . గత 16 నెలల్లో దాదాపు 3 లక్షల ఇళ్ల పూర్తి చేసి పేదలకు తాళాలు అప్పగించడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నిర్మాణంలో ఆగిపోయిన ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రూలర్ ఎమ్మార్వో శ్రీవాణి, ఎంపీడీఓ సుగుణ శ్రీ , డిప్యూటీ ఎంపీడీఓ నాగజ్యోతి, హౌసింగ్ డీఈ విజయ బాబు , చాపిరేవుల గ్రామ టీడీపీ నాయకులు భూపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి , సుబ్బారెడ్డి, సర్పంచ్ రాజు, సంజన , సుబ్బరాయుడు, మునిస్వామి, రాజశేఖర్, బిజ్జల శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల





మన గళం ప్యాపిలి : మండలంలోని రామాపురం, డి రంగాపురం, రాచ వాండ్లపల్లి, మామిళ్ళపల్లి ఈ గ్రామాలలో రచ్చబండ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. మరియు ప్రధానమంత్రి ఆవాస్ యోజన మన ఇల్లు మన గౌరవం కింద గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలు, అభ్యర్థనలు, అభివృద్ధి సూచనలను స్వయంగా విన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, విద్యాసంస్థల మెరుగుదల వంటి అంశాలపై ప్రజలతో సమగ్రంగా చర్చించారు. గ్రామంలోని రైతులు, మహిళా సంఘాలు, యువత తో ప్రత్యేకంగా సమావేశమై, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజల అభ్యర్థనల మేరకు సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు జారీచేశారు.



# వార్షిక క్రీడా దినోత్సవ నివేదిక రాజంపల్లి






మన గళం: కేంద్ర విద్యాలయ రాజంపల్లి వార్షిక క్రీడా దినోత్సవం 12 నవంబర్ 2025న పాఠశాల ఆవరణలో ఎంతో ఉత్సాహంగా మరియు ఆనందభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, బృందపాటు, శారీరక దృఢత్వం పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ శ్రీనివాస రెడ్డి గారు కరాటే (బ్లాక్ బెల్ట్ 7వ డాన్) విచ్చేసి, ప్రధానాచార్యులు, శ్రీ మహావీర్ సింగ్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమం క్రీడా జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభమై, విద్యార్థుల మార్చ్ పాస్ట్తో మరింత ఆకర్షణీయంగా సాగింది. అనంతరం ముఖ్య అతిథి క్రీడా స్ఫూర్తితో క్రీడా వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. తర్వాత 100 మీ., పరుగులు, రీలే రేసులు, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి వివిధ క్రీడా పోటీలు నిర్వహించబడ్డాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను, క్రమశిక్షణను, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. మాస్ డ్రిల్, మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన ఆటలు కూడా కార్యక్రమానికి ఆనందాన్ని చేకూర్చాయి. తదుపరి జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో, ముఖ్య అతిథి శ్రీ శ్రీనివాస రెడ్డి గారు విజేతలకు పతకాలు మరియు ధ్రువపత్రాలు అందజేసి విద్యార్థులను మరింత ప్రోత్సహించారు. ఈ సంవత్సరం టాగోర్ హౌస్ మొత్తం పాయింట్లలో ముందంజలో నిలిచి మొత్తం విజేత హౌస్‌గా నిలిచింది. ప్రధానాచార్యులు తమ ప్రసంగంలో విజేతలందరికీ అభినందనలు తెలియజేసి, ముఖ్య అతిథికి ధన్యవాదాలు తెలిపారు. చివరగా జాతీయ గీతంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# పీపీపీ విధానంతో రాష్ట్రానికి అదనంగా 220 మెడికల్ సీట్లు





మన గళం, ప్యాపిలి : మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాష్ట్రంలో పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 220 మెడికల్ సీట్లు లభించనున్నాయని డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.జగన్ ప్రభుత్వ విధానంతో పోలిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పీపీపీ విధానం ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతోందని ఆయన తెలిపారు. ఇందులో ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 110 సీట్లు పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు అదనంగా లభిస్తాయని వివరించారు.రాబోయే రెండేళ్లలో పది కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం, వైద్య సిబ్బంది నియామకాలు పూర్తవుతాయని, దీంతో మొత్తం 1750 కొత్త మెడికల్ సీట్లు రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. "జగన్ చేసిన విధానంతో ఉంటే ఈ సీట్లు పొందడానికి 15 ఏళ్లు ఎదురు చూడాల్సి వచ్చేది," అని వ్యాఖ్యానించారు.పీపీపీ విధానంలో నిర్మించే ఆసుపత్రుల ద్వారా పేదలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు లభిస్తాయని, ఫీజులు మరియు రిజర్వేషన్లు ప్రభుత్వ విధానాల ప్రకారం కొనసాగుతాయని చెప్పారు. "ఎలుకలను పట్టగలగడం ముఖ్యం, అది నల్ల పిల్లా తెల్ల పిల్లా అన్నది ముఖ్యం కాదు," అంటూ ప్రజా ప్రయోజనమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని హాస్యప్రాయంగా పేర్కొన్నారు.జగన్ ముఠా స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తోందని, ప్రజలు ఈ కుట్రలకు లొంగకూడదని పిలుపునిచ్చారు. "స్వర్ణాంధ్ర సాధన ద్వారా తెలుగువారిని దేశంలో అగ్రస్థానంలో నిలపడం మన లక్ష్యం" అని అన్నారు.

## మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు దూరం కానున్న విద్య.. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి





మన గళం బనగానపల్లె : మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయటంతో పేద విద్యార్థులకు మెడికల్ విద్య దూరం అవుతుంది అని బనగానపల్లె మాజీ శాసనసభ్యుడు కాటసాని రామిరెడ్డి బుధవారం అన్నారు.నంద్యాల జిల్లా బనగానపల్లె లో మెడికల్ కాలేజ్ ల ప్రవేటికరుణ కు వ్యతిరకంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తన స్వగృహం నుండి తనతో పాటు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, బనగానపల్లె వైఎస్ఆర్సిపి పరిశీలకుడు భూమ కిషోర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలతో కలిసి తహశీల్దార్ నారాయణ రెడ్డి కి మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ పై వివరించి వినతి పత్రం అందించడం జరిగింది. అనంతరం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు,ప్రభుత్వ ఆస్తులు ,ఏపీ టూరిజం , మెడికల్ కాలేజీలు అన్ని కూడా ప్రైవేట్ పరం చేస్తా ఉన్నారు. ఈ ప్రభుత్వాన్ని కూడా ప్రైవేటు పరం చేస్తే బాగుంటాదని నేను కోరుకుంటున్న ఎందుకంటే నీ పాలన అలా ఉంది అని ఆయన ఎద్దేవా చేశారు. రైతులకు ఎవరికి కూడా రైతుభరోసా ఇవ్వలేదు. మోంతా తుఫాను కు నష్టపోయిన ఏ రైతుకు కూడా పంట నష్టపరిహారం కానీ , ఇన్సూరెన్స్ గానీ ఇంతవరకు ఇవ్వలేదు అని ప్రభుత్వాన్ని విమర్శించారు.

# ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడులతో రండి

**– నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**






మనగళం, ప్రత్యేక ప్రతినిధి : పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడులతో రావాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. బుధవారం న్యూ ఢిల్లీలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశానికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 14, 15, 20 వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో 30 వ సీఐ ఐ భాగస్వామ్య సదస్సు జరుగుతుందన్నారు. వేగంగా నడుచే కంపెనీలు ఆంధ్రప్రదేశ్ ను ఎంచుకోవాలని ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

# మనస్సు మార్చుకున్న ట్రంప్..

న్యూఢిల్లీ,నవంబర్12 ,మన గళం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మనస్సు మార్చుకున్నట్లు తెలుస్తోంది. హెచ్-1బీ వీసాలపై కాస్త మెత్తబడ్డారు. హెచ్-1బీ వీసా సంస్కరణలపై తాజాగా ఆయన స్వరం మార్చారు. అమెరికాకు ప్రత్యేక నైపుణ్యం ఉన్న విదేశీ ఉద్యోగులు అవసరమని అంగీకరించారు. దీంతో ఇప్పుడు హెచ్-1బీ వీసాలపై కఠిన నిర్ణయాల్ని వెనక్కి తీసుకుంటారన్న అంచనాలు పెరిగిపోయాయి. ఈ క్రమంలోనే అక్కడ ప్రధానంగా ఈ వీసాలపై ఆధారపడి ఉన్న భారతీయ ఐటీ స్టాక్స్ దూసుకెళ్లాయి.కొంత కాలంగా భారతీయ ఐటీ కంపెనీల స్టాక్స్ పెద్దగా రాణించట్లేదని చెప్పొచ్చు. ఇక్కడ ప్రధానంగా అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఇలా అన్నీ గరిష్ట స్థాయిల నుంచి భారీగా పడిపోయాయి. ఈ స్టాక్స్ పతనానికి ప్రధాన కారణం.. అమెరికాలోని కంపెనీల్లో విదేశీ నిపుణుల్ని నియమించుకునేందుకు యాజమాన్యాలు ఇచ్చే హెచ్1- బీ వీసాలపై కఠిన రూల్స్ తీసుకురావడమే. అవును.. అప్పట్లో హెచ్1- బీ దరఖాస్తు ఫీజును ఎన్నో రెట్లు పెంచుతూ ప్రకటన చేశారు. దీంతో.. అమెరికాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న భారతీయ దిగ్గజ ఐటీ కంపెనీలపై ఈ ప్రభావం పడింది. ఇవి ఎక్కువగా ఈ వీసాలపై ఆధారపడి పనిచేస్తున్నాయని చెప్పొచ్చు.తాజాగా.. డొనాల్డ్ ట్రంప్ తన స్వరం మార్చారు. సంస్కరణల అమలుపై కాస్త వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. తాజాగా హెచ్1-బీ వీసాలపై, వలస దారుల విధానంపై ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీంతో భారతీయ ఐటీ కంపెనీలకు ఇది శుభవార్తగా పరిణమించింది. ఈ క్రమంలోనే పలు ఐటీ స్టాక్స్ బుధవారం సెషన్‌లో భారీగా దూసుకెళ్తున్నాయి. అమెరికన్ ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో.. అమెరికా శ్రామిక శక్తిలో కీలక స్థానాల్ని భర్తీ చేసేందుకు విదేశాల నుంచి ప్రత్యేక నిపుణుల అవసరం ఉందని ట్రంప్ అంగీకరించారు.ఈ వ్యాఖ్యలే.. హెచ్1బీ వీసాలపై గతంలో ఆయన తీసుకున్న కఠిన నిర్ణయాల్ని వెనక్కి తీసుకునేలా చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# 396 గృహ నిర్మాణాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కోట్ల

ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆ దిశగా రాష్ట్రంలోని సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు గృహాలు అందజేయాలన్న హామీ అమలు దిశగా మరో ముఖ్యమైన అడుగు వేయబడింది.







మన గళండోన్ పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గ్రామంలో ఈ రోజు జరిగిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన %-% మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా నూతన గృహాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొడోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి , ఎన్నికల హామీలను అమలు చేస్తూ పేదల కలలను నిజం చేస్తున్న కూటమి ప్రభుత్వ సంకల్పాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలన్నది మా నాయకుడు నారా చంద్రబాబు నాయుడు గారి కల. ఆ కలను సాకారం చేయడం మనందరి బాధ్యత. పేదల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం అచంచలంగా కృషి చేస్తోంది" అని పేర్కొన్నారు. డోన్ నియోజకవర్గంలో పేదలకు గృహాలు కేటాయించడంలో పారదర్శకతతో వ్యవహరించబడుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# అచంపేట్ ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఏఐసీసీ బాధ్యతలు

మనగలం : బ్రాహ్మగిరి : సంఘటన్ సృజన్ అభియాన్" పరిశీలకుడిగా నియామకం కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సంఘటన్ సృజన్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా, తమిళ నాడు రాష్ట్రానికి ఏఐసీసీ పరిశీలకుడిగా నాగర్ కర్నూల్ డిసీసీ అధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ నియమితులయ్యారు. ఈ నియామకాన్ని ఆల్ ఇండి యా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆమోదించగా, లోకసభప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్) కె.సి. వేణుగోపాల్, ప్రియాంక గాంధీ వాద్రాల మద్దతుతో నిర్ణయం తీసుకు న్నారు.





# ఎరదోడి చిల్లబండ వెంకటగిరి పంచాయతీలోని ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం గురించి అవగాహన కల్పించిన ఎంపీడీవో







మన గళం కోడుమూరు: పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా కోడుమూరు ఎంపీడీవో ఏసి రాముడు ఉదయం ఎరదోడి పంచాయతీలోని చిల్లబండ గ్రామానికి అదేవిధంగా వెంకటగిరి గ్రామాలను సందర్శించి అక్కడ ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తూ అదే విధంగా ఐవిఆర్ఎస్ కాల్స్ ఏ విధంగా ప్రజలు అటెండ్ చేయాలనేటువంటి అంశము తెలియజేస్తూ పంచాయతీ కార్యదర్శులకు గ్రీన్ అంబాసిడర్ సూచనలు ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కూడా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేసి ప్రజలకు ఆరోగ్యకరమైనటువంటి పరిశుభ్రమైనటువంటి వాతావరణాన్ని నెలకొల్పుటకు గ్రామపంచాయతీ సిబ్బంది క్లాప్ మిత్రస్ అదే విధంగా పంచాయతీ సెక్రెటరీ సర్పంచులు అందరు కూడా తగు చర్యలు తీసుకోవాలని తెలియజేయడమైనది మరియు ఎర్రదొడ్డి గ్రామ సచివాలయంలో స్వమిత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారికి ప్రాపర్టీ పార్సెల్ నెంబర్ కేటాయించే విషయంలో 9. నోటీసు ప్రతి ఒక్కరికి కూడా ప్రజలకు అందజేసి ప్రజల దగ్గర ఆమోదం తీసుకొని ఏమైనా అభ్యంతరాలు ఉంటే కూడా అభ్యంతరాలను పరిష్కరించవలసిందిగా స్వామిత్వ సభ్యులపంచాయతీ సెక్రెటరీ ఇంజనీరింగ్ అసిస్టెంట్ అదేవిధంగా అక్కడ ఉన్నటువంటి సచివాలయం సిబ్బంది అందరూ కూడా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు

# ఎగ్జిట్ పోల్స్ అంచనాలు..



న్యూఢిల్లీ,నవంబర్12 ,మన గళం: వరుసగా మూడో సెషన్‌లో స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 25,900 పాయింట్లు దాటింది. రియాలిటీ మినహా అన్నిరంగాల్లో కొనుగోళ్లు జరిగాయి. ప్రపంచ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు లాభాల్లో మొదలయ్యాయి. బిహార్ ఎగ్జిట్ పోల్స్‌లో ఎన్డీయే స్పష్టమైన విజయం సాధిస్తుందన్న అంచనాలు.. భారత్-యూఎస్ వాణిజ్య చర్చల్లో పురోగతితో పాటు భారత్‌పై సుంకాలను తగ్గిస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలతో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 84,238.86 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,166.75 కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 84,652.01 పాయింట్లకు పెరిగింది.చివరకు 595.19 పాయింట్లు పెరిగి 84,466.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 180.85 పాయింట్లు పెరిగి 25,875.80 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ తాజా 52 వారాల గరిష్ట స్థాయి 61,011ని తాకింది, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.8 శాతం పెరిగింది. నిఫ్టీలో ఏషియన్ పెయింట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఓఎన్‌జీసీ అత్యధికంగా లాభపడ్డాయి. ఇక టాటా స్టీల్, టీఎంపీవీ, భారత్ ఎలక్ట్రానిక్స్, శ్రీరామ్ ఫైనాన్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ నష్టపోయాయి. రియల్టీ మినహా, మిగతా అన్ని రంగాల సూచీలు మీడియా, ఆటో, టెలికాం, ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఒకటి నుంచి రెండుశాతం వరకు పెరిగాయి. క్యూ2 లాభం 61శాతం పెరిగిన తర్వాత బీఎస్ఈలో షేర్లు 5శాతం.. ఆటోడెస్క్‌తో భాగస్వామ్యంతో ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ షేర్లు 1.5శాతం వృద్ధి చెందాయి.ఆవాస్ ఫైనాన్షియర్స్ షేర్లు 5శాతం, క్యూ 2 లాభం 48శాతం, గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ షేర్ ధర 5శాతం పెరగ్గా.. లాభాలు తగ్గిన తర్వాత థర్మాక్స్ షేర్ ధర 3శాతం తగ్గింది. జీఈ షిప్పింగ్, మాక్స్ ఫైనాన్షియల్, అదానీ పోర్ట్స్, కెనరా బ్యాంక్, టైటాన్ కంపెనీ, యూపీఎల్, అదానీ ఎనర్జీ, ఆల్కెమ్ ల్యాబ్, హిటాచి ఎనర్జీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆసియన్ పెయింట్స్, నాల్కో, భెల్, అసాహి ఇండియా, కెన్ ఫిన్ హోమ్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌పీసీఎల్, ఐఓసీ, భారత్ ఫోర్జ్, అశోక్ లేలాండ్, ఇతర స్టాక్స్ బీఎస్ఈలో 52వారాల గరిష్ట స్థాయిని తాకాయి

# లోన్ తీసుకున్నవారికి శుభవార్త.. ఈఎంఐలు తగ్గనున్నాయి!




న్యూఢిల్లీ,నవంబర్12 , మన గళం : ఈ బ్యాంకులో హోమ్ లోన్ తీసుకున్న వారికి అదిరే శుభవార్త. వివిధ రుణాలకు సంబంధించిన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను ఈ ప్రభుత్వ బ్యాంక్ తగ్గించింది. అన్ని టెన్యూర్లపై 5 బేసిస్ పాయింట్ల మేర తగ్గించినట్లు తెలిపింది. నవంబర్ 12, 2025 నుంచే సవరించిన వడ్డీ రేట్లను అమలులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. దీంతో లోన్ ఈఎంఐలు ఒక్కసారిగా దిగిరానున్నాయి. అలాగే బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడీబీఐ బ్యాంకులు ఎంసీఎల్ఆర్ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించాయి. దేశంలోని ప్రభుత్వ రంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన కెనరా బ్యాంక్ తమ కస్టమర్లకు అదిరే శుభవార్త అందించింది. రుణాల భారాన్ని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. వివిధ రుణాలకు లింక్ అయి ఉండే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు (ఎంసీఎల్ఆర్) అన్ని టెన్యూర్ల రుణాలపై 5 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. ఫ్లోటింగ్ రేట్ వడ్డీతో పర్సనల్ లోన్, ఆటో లోన్, హోమ్ లోన్ తీసుకున్న వారికి నెలవారీ ఈఎంఐ ల భారం తగ్గనుంది. ఇక సవరించిన కొత్త ఎంసీఎల్ఆర్ రేట్లను నవబంర్ 12, 2025 నుంచే అమలులోకి తీసుకొచ్చినట్లు కెనరా బ్యాంక్ తెలిపింది.

# బీఎస్ఎన్ఎల్ ఆఫర్‌కు ఇంకా 3 రోజులు మాత్రమే!




హైదరాబాద్,నవంబర్12, మన గళం : ప్రస్తుత రోజుల్లో ఒక్క రూపాయికి పిల్లలు కొనుక్కునే చాక్లెట్ సైతం రావడం లేదు. ద్రవ్యోల్బణం ప్రభావంతో రూపాయికి పెద్దగా విలువ లేదు. ఏది కొన్నా పదులు, వందలు, వేలు వెచ్చించాల్సిందే. అయితే, మీరు కేవలం 1 రూపాయికే బీఎస్ఎన్ఎల్ ఆఫర్ పొందొచ్చు. 4జీ నెట్‌వర్క్ 30 రోజుల పాటు ఉచితంగా ఆస్వాధించవచ్చు. అది కూడా రోజుకు 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాలింగ్, 100 ఎస్ఎంఎస్‌లు అందుకోవచ్చు. అయితే భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ అందిస్తోన్న ఈ స్పెషల్ ఆఫర్ గడువు ముగుస్తోంది. నవంబర్ 15వ తేదీ వరకే అందుబాటులో ఉంటుంది. మరెందుక ఆలస్యం ఇప్పుడే ఆఫర్ వివరాలు తెలుసుకుని త్వరపడండి.బీఎస్ఎన్ఎల్ కొద్ది రోజుల క్రితం దీపావళి ఆఫర్ ప్రకటించింది. కేవలం ఒక్క రూపాయికే సిమ్ కార్డు అందిస్తోంది. కొత్త యూజర్లు వందల రూపాయలు వెచ్చించాల్సిన అవసరం లేకుండా కేవలం ఒక్క రూపాయికే 4జీ నెట్‌వర్క్ కనెక్షన్ ఉచితంగా అందిస్తోంది. ఈ ఆఫర్ సమయంలో 30 రోజుల పాటు సూపర్ బెనిఫిట్స్ కల్పిస్తోంది. దివాలీ బొనాంజా 2025 ఆఫర్‌లో భాగంగా ఈ రూ.1 ఆఫర్ తీసుకొచ్చింది. అక్టోబర్ 15వ తేదీన లాంచ్ చేయగా నవంబర్ 15, 2025తో ఈ ఆఫర్ ముగుస్తోంది. ఆలోపు కొత్త సిమ్ కొనుగోలు చేసిన వారికి 30 రోజుల వ్యాలిడిటీతో రోజుకు 2జీబీ డేటా, ఏ నెట్‌వర్క్‌కి అయినా అపరిమిత కాలింగ్ రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి.ఈ ఆఫర్‌లో కొత్త కనెక్షన్ తీసుకుని 30 రోజులు అపరిమిత బెనిఫిట్స్ అందుకోవచ్చు. అందుకోసం సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ లేదా అధికృత రిటైల్ డీలర్ వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. కేవైసీ డాక్యుమెంట్లు సమర్పించి ఉచితంగా సిమ్ కార్డు తీసుకుని రూ.1 ప్లాన్ యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది. కొత్త సిమ్ 4జీ నెట్‌వర్క్ పైన వస్తుంది. ఏదైనా సందేహం ఉంటే 1800-180-1503కి ఫోన్ చేయడం లేదా %ఎంఅశ్రీ.ఏశీ.ఱఅ% అనే వెబ్‌సైట్లోకి వెళ్లి నివృత్తి చేసుకోవచ్చు.ఇలాంటి ఆఫర్ అంతకు ముందు ఆగస్టు 2025లో తీసుకొచ్చింది. ఫ్రీడమ్ ఆఫర్ పేరుతో ఒక్క రూపాయికే సిమ్ కార్డ్ అందించింది. అప్పుడు ఆ స్కీమ్కి మంచి ఆదరణ లభించింది. ఆగస్టు నెలలో కొత్తగా 1.30 లక్షల మంది రూ.1 ప్లాన్ ద్వారా కొత్త సిమ్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎయిర్టెల్‌ని సైతం కొత్త యూజర్ల కేటగిరీలో వెనక్కి నెట్టడం గమనార్హం. అప్పుడు మంచి స్పందన వచ్చిన క్రమంలో మళ్లీ దీపావళి ధమాకా పేరుతో మరోసారి ఆఫర్ తెచ్చింది.

# రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనం జయప్రదం చేయండి కోడుమూరులో జీపు ప్రచార జాత





మన గళం
కోడుమూరు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 18,19 తేదీలలో కర్నూలు జిల్లా,ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో గల ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని రోషన్ గార్డెన్స్ నందు జరగనున్న రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనానికి రైతులందరూ తరలిరావాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య,జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ లు పిలుపునిచ్చారు.రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనం జయప్రదం చేయాలనే కోరుతూ చేపట్టిన జీపు ప్రచార జాత బుధవారం కోడుమూరు పట్టణానికి చేరుకుంది.జీపు ప్రచారం జాతకు సీపీఐ మండల కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జిల్లాలో సుమారు 6లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారని అయితే రైతులు ఎకరాకు రూ.80వేలు పెట్టుబడి కింద ఖర్చు చేశారని గుర్తు చేశారు. కానీ అధిక వర్షాల ప్రభావం వల్ల జిల్లాలో పత్తి పంట పూర్తిగా దెబ్బతిందని పేర్కొన్నారు.పత్తి తోపాటు జిల్లాలో ఉల్లి,కంది, టమోటా,వేరుశనగ, మిరప వంటి తదితర పంటలు సాగు చేశారని,అధిక వర్షాల కారణంగా అన్ని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు.సిసిఐ ద్వారా కొనుగోలు చేసే పత్తి పంటకు క్వింటాలు రూ.12000లు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని,ఉల్లి, పత్తి ధరలు పడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమ్మేళనంలో పత్తి రైతుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన తీర్మానాలు ఆమోదిస్తామని తెలిపారు.రాష్ట్ర స్థాయి పత్తి రైతుల సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య, అఖిల భారత కిసాన్ సభ, ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రాజన్ క్షీరసాగర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు జి ఈశ్వరయ్య,ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్,సిపిఐ కర్నూలు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం, కర్నూలు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం,జిల్లా అధ్యక్షులు కె నాగేంద్రయ్య, జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ సుదర్శన్,ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి టి వీరేష్, ఆదోని సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు హాజరవుతున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజసాబ్, వలుకూరు రైతులు అల్లిసా, రాముడు,కోడుమూరు ఎపి రైతు సంఘం అధ్యక్షుడు గొల్ల రాజు,కృష్ణ,సిపిఐ జిల్లా మహిళా సంఘం సులోచనమ్మ మాదన్న,మునిస్వామి, తిమ్మప్ప,ముడమలగుర్తి రంగన్న,వెంకటగిరి ఎల్లప్ప, వీరప్ప,చాకలి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## ఈ టూర్ కఠినమైనదే - కేశవ్ మహరాజ్



ముంబై, నవంబర్12,, మన గళం : సౌతాఫ్రికా ప్రస్తుతం భారత పర్యటనలో ఉంది. టీమిండియాతో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. అయితే గత 15 ఏళ్లుగా సఫారీ సేన భారత గడ్డపై ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా గెలవలేదు. దీంతో ఈసారి ఎలాగైనా టీమిండియాను ఓడించి.. భారత్‌లో సత్తా చాటాలని సౌతాఫ్రికా చూస్తోంది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా స్టార్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ మాట్లాడాడు. 'భారత్‌లో భారత్‌ను ఓడించడం అంత సులువైన విషయం కాదు. కానీ మేము ఈ సిరీస్ గెలవడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. మాకు తెలుసు.. ఈ టూర్ చాలా కఠినమైనది అని. భారత్‌లో ఆడటం మాకు పెద్ద పరీక్షే. అయినా మమ్మల్ని మేం నిరూపించుకోవడానికి ఇదో అద్భుత అవకాశం. పాకిస్తాన్‌లో ఉన్నట్లుగా ఇక్కడ పూర్తి స్పిన్ ఫ్రెండ్లీ పిచ్ ఉంటుందని నేను అనుకోవడం లేదు. భారత్‌లో మంచి పిచ్‌లు ఉంటాయి. ఆట సాగుతున్న కొద్దీ వాటి స్వభావాలు మారుతుండొచ్చు' అని కేశవ్ వెల్లడించాడు. అయితే ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను సఫారీ సేన 1-1తో డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే.

## గుజరాత్ టీంలో భారీ మార్పులు..



ముంబై, నవంబర్12 ,మన గళం :: 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో నిలిచి ప్లేఆఫ్‌లకు చేరుకున్న గుజరాత్ టైటాన్స్ జట్టు.. ఐపీఎల్ 2026 వేలానికి ముందు అంటే నవంబర్ 15న జగరబోయే రిటెన్షన్‌కు సిద్ధమైంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, రషీద్ ఖాన్ జట్టుకు ప్రధానాంశంగా ఉంటారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమ పర్స్ బ్యాలెన్స్‌ను నిర్వహిస్తూనే, జట్టును మరింత బలోపేతం చేయడానికి %+ు% కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు ట్రేడ్ పుకార్లు, కొందరు ఆశించినంతగా రాణించని ఆటగాళ్లపై దృష్టి సారించినందున, మినీ-వేలానికి ముందు ఫ్రాంచైజీ కొన్ని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 2025లో 15 మ్యాచ్‌లలో 50 సగటు, 155.88 స్ట్రైక్ రేట్‌తో 650 పరుగులు చేసి జట్టుకు గుండెకాయలా నిలిచాడు. అతనితో పాటు, సాయి సుదర్శన్ స్థిరమైన ఫామ్, రషీద్ ఖాన్ మ్యాచ్ విన్నింగ్ స్పెల్స్ గుజరాత్ ప్రణాళికల్లో కీలకం. నమ్మదగిన బౌలర్లు మొహమ్మద్ సిరాజ్, కగిసో రబాడాలను కూడా రిటైన్ చేసుకునే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. తద్వారా జీటీ తమ వేలం వ్యూహంలో దేశీయ-విదేశీ ఆటగాళ్ల సమతుల్య మిశ్రమాన్ని కాపాడుకోవాలని చూస్తోంది.గుజరాత్ టైటాన్స్‌కు సంబంధించి ట్రేడ్ విండోలో అనేక చర్చలు జరిగాయి. తమిళనాడు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను తిరిగి సొంతగడ్డకు తీసుకురావాలని చెన్నై సూపర్ కింగ్స్ (%జూఖ%) తీవ్ర ఆసక్తి చూపినట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే, ప్లేయర్ స్వాప్, ఆల్-క్యాష్ డీల్‌తో సహా చెన్నై నుంచి వచ్చిన అనేక ఆఫర్‌లను గుజరాత్ తిరస్కరించినట్లు సమాచారం. ప్రస్తుతానికి, సుందర్ గుజరాత్ జట్టులో ముఖ్యమైన భాగంగానే ఉన్నాడు.

గుజరాత్ టైటాన్స్ రిటైన్ చేసుకోబోయే, రిలీజ్ చేసే అవకాశం ఉన్న ఆటగాళ్లు (అంచనా)..

గుజరాత్ టైటాన్స్ ప్రాబబుల్ రిటైన్డ్ ప్లేయర్స్: శుభమాన్ గిల్, సాయి సుదర్శన్, జోస్ బట్లర్ , రషీద్ ఖాన్, వాషింగ్టన్ సుందర్, మొహమ్మద్. అర్షద్ ఖాన్, సాయి కిషోర్, షారుఖ్ ఖాన్, కగిసో రబడా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్, ఇషాంత్ శర్మ, రాహుల్ తెవాటియా, అనుజ్ రావత్, మహిపాల్ లోమ్రోర్. గుజరాత్ టైటాన్స్ ప్రాబబుల్ రిలీజ్డ్ ప్లేయర్స్: కుసల్ మెండిస్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, దసున్ షనక, గెరాల్డ్ కోయెట్జీ, గుర్నూర్ సింగ్ బ్రార్, కరీం జనత్, కుమార్ కుషాగ్రా, నిశాంత్ సింధు, జయంత్ యాదవ్.




Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310